పంజాబ్‌లోనే ఎందుకు?

- అక్రమ వలసదారుల విమానాలు దిగడంపై వివాదం
- పంజాబ్‌ను అపఖ్యాతిపాలు చేయడమే లక్ష్యమా?
- కేంద్ర ప్రభుత్వంపై సీఎం మాన్ సహా విపక్షాల ఆగ్రహం

అమృత్‌సర్ : అమెరికా నుంచి తిరిగి వస్తున్న అక్రమ వలసదారుల విమానాలు దిగడానికి పంజాబ్‌ను ఎంచుకోవడంపై ఆ రాష్ట్రంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సహా ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా కేంద్ర ప్రభుత్వ చర్యలను ఘాటుగా విమర్శిస్తున్నాయి. ఇదంతా ఉద్దేశపూర్వకంగా పంజాబ్‌ను అపఖ్యాతిపాలు చేయడానికి జరుగుతున్న ప్రయత్నమా? అని మాన్ నిలదీశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్చలు జరుపుతున్న సమయంలో, అమెరికా అధికారులు మనవారికి సంకెళ్లు వేసి ఉంటారని, ఇది మోదీకి ట్రంప్ ఇచ్చిన బహుమతా? అని ప్రశ్నించారు. ఈ విమానాలు దిగడానికి అమృత్‌సర్‌ను ఎంపిక చేయడంలో ఏ విధానాన్ని అనుసరించారో విదేశీ వ్యవహారాల శాఖ చెప్పాలన్నారు. ఈ నెల 5న వచ్చిన మొదటి విమానాన్ని అహ్మదాబాద్‌లో ఎందుకు దించలేదని ప్రశ్నించారు. దానిలో వచ్చినవారిలో అత్యధికులు గుజరాతీలేనన్నారు. పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పల్ సింగ్ చీమ మాట్లాడుతూ, ఈ విమానాలు పంజాబ్‌లోనే దిగేలా చేయడం ద్వారా రాష్ట్రాన్ని అపఖ్యాతిపాలు చేయాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటున్నదని మండిపడ్డారు. ఈ విమానాలు హర్యానా, గుజరాత్ రాష్ట్రాలకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ కూడా ఇదే విధంగా స్పందించింది. కాగా, 119 మంది భారత వలసదారులతో కూడిన మరో విమానం శనివారం అమెరికా నుంచి అమృత్‌సర్‌కు చేరుకోనుంది.

అమెరికా వీసాల రెన్యువల్ మరింత ఆలస్యం

రెన్యువల్ విధానాన్ని మార్చిన ట్రంప్ సర్కారు.. పర్యాటక, వ్యాపార వీసాలపైనా ప్రభావం

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: అమెరికా వీసాలు రెన్యువల్ చేసుకోవడానికి ఇక ఎదురుచూపులు మరింత పెరగనున్నాయి. హెచ్-1బీ, బీ1, బీ2 వంటి నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాలను వ్యక్తిగత ఇంటర్వ్యూ అవసరం లేకుండా రెన్యువల్ చేసే డ్రాప్‌బాక్స్ విధానం అర్హతను అమెరికా మార్చింది. 12 నెలల్లోపు గడువు ముగిసిన వీసాలను అదే క్యాటగిరీలో రెన్యువల్ చేయించుకునే అవకాశం డ్రాప్‌బాక్స్ ద్వారా ఉండేది. అయితే, కొవిడ్ సమయంలో వెయిటింగ్ పీరియడ్ ఎక్కువ కావడంతో 12 నెలల పరిమితిని 48 నెలలకు పెంచారు. దీంతో హెచ్-1బీ, బీ1(వ్యాపార), బీ2(పర్యాటక), ఎల్-1 వంటి నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాల గడువు ముగిసి నాలుగేండ్లు అయినా అమెరికా కాన్సులేట్‌లలో ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సిన అవసరం లేకుండానే డ్రాప్‌బాక్స్ ద్వారా రెన్యువల్ చేసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు ఈ విధానాన్ని మరోసారి మార్చి, కొవిడ్‌కు ముందు ఉన్నట్టుగానే 12 నెలలకు కుదించారు. దీంతో నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాల గడువు ముగిసి 12 నెలలు దాటిన వారు వీసాలు రెన్యువల్ చేసుకోవడానికి మళ్లీ యూఎస్ కాన్సులేట్‌లలో ఇంటర్వ్యూలకు వెళ్లాల్సి ఉంటుంది. వీసాల రెన్యువల్ మరింత ఆలస్యం కానుంది. ఈ కొత్త విధానం ఇప్పటికే అమలులోకి వచ్చింది.

కొత్త సీఈసీగా జ్ఞానేశ్ కుమార్?

న్యూఢిల్లీ: భారత ప్రధాన ఎన్నికల అధికారిగా(సీఈసీ) కేరళ క్యాడర్ విశ్రాంత ఐఏఎస్ అధికారి జ్ఞానేశ్ కుమార్ నియమితులయ్యే అవకాశం కనిపిస్తున్నది. ప్రస్తుత సీఈసీ రాజీవ్ కుమార్ ఈ నెల 18న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న కొత్త సీఈసీ ఎంపిక కోసం సమావేశం జరగనుంది. మొత్తం 480 మంది ఈ పోస్టుకు పోటీ పడుతుండగా సెర్చ్ కమిటీ అయిదుగురి పేర్లను ఎంపిక కమిటీకి సిఫారసు చేయనున్నట్టు సమాచారం. వీరిలో జ్ఞానేశ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. ఈ నెల 17న జరిగే సమావేశంలో ప్రధాని మోదీ, న్యాయశాఖ మంత్రి మేఘ్వాల్, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ కలిసి కొత్త సీఈసీని ఎంపిక చేస్తారు. 1988 బ్యాచ్‌కు చెందిన జ్ఞానేశ్ కుమార్ సహకార శాఖ కార్యదర్శిగా నిరుడు జనవరి 31న రిటైర్డ్ అయ్యారు.

నటుడు విజయ్‌కి 'వై' క్యాటగిరీ భద్రత

చెన్నై: తమిళ నటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్‌కి కేంద్ర ప్రభుత్వం 'వై' క్యాటగిరీ భద్రతను కల్పించింది. దీని ప్రకారం ఆయనకు 8 మంది భద్రత కల్పిస్తారు. వీరిలో సాధారణ పోలీసులు, ఒకరిద్దరు నేషనల్ సెక్యూరిటీ గార్డ్ కమాండోలు ఉంటారు. నిర్దిష్టమైన ముప్పు ఉన్నవారికి ఇటువంటి భద్రత కల్పిస్తారు. విజయ్ నిరుడు ఫిబ్రవరిలో టీవీకే పార్టీని స్థాపించారు. 2026లో జరిగే తమిళనాడు శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

చట్టాల రూపకల్పనపై కోర్టులు ఆదేశించరాదు

సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఫలానా విధంగా చట్టాన్ని రూపొందించాలని చట్ట సభలను న్యాయస్థానాలు ఆదేశించజాలవని సుప్రీంకోర్టు శుక్రవారం చెప్పింది. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాత పార్లమెంటు నూతన శాసనాన్ని తీసుకొస్తుందని తెలిపింది. శాసనాన్ని ఫలానా విధంగా రూపొందించాలని చట్ట సభను సుప్రీంకోర్టు లేదా హైకోర్టులు తమకు గల రిట్ అధికార పరిధిని వినియోగించి ఆదేశించజాలవని స్పష్టం చేసింది. ఈ అంశంపై దాఖలైన పిల్‌ను 2024 ఫిబ్రవరిలో ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన అప్పీలుపై సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. దీనిపై విచారణ జరిపేందుకు నిరాకరించింది.

రాజకీయ పార్టీలను ఆర్‌టీఐ పరిధిలోకి తేవాలి

కేంద్రం, ఈసీ స్పందన కోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: జవాబుదారీతనం తీసుకువచ్చేందుకు, ఎన్నికల సందర్భంగా నల్ల ధనాన్ని అరికట్టేందుకు రాజకీయ పార్టీలను సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వాలని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్, ఆరు రాజకీయ పార్టీలను ఆదేశించింది. ఎన్జీఓ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్), న్యాయవాది అశ్వనీ ఉపాధ్యాయ దాఖలు చేసిన రెండు పిటిషన్లపై చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీచేసింది. ఈ పిటిషన్లపై తుది విచారణను సావధానంగా వింటామని, ఈలోగా వాదనలు పూర్తి చేద్దామని సీజేఐ తెలిపారు. తదుపరి విచారణ ఏప్రిల్ 21కి వాయిదా వేసింది.

మార్చి 19న భూమిపైకి సునీతా విలియమ్స్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గత 8 నెలలుగా చిక్కుకుపోయిన భారత సంతతి నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ మార్చి 19న తిరిగి భూమిపైకి రానున్నారు. సీఎన్ఎన్‌తో మాట్లాడిన సునీతా విలియమ్స్, బుట్చ్ విల్‌మోర్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఆరు నెలల సుదీర్ఘ కాల మిషన్ కోసం మార్చి 12న ఐఎస్ఎస్‌కు వెళ్లనున్న క్రూ-10 మిషన్‌లోని వ్యోమగాములకు సునీతా, విల్‌మోర్ తమ బాధ్యతలను అప్పగిస్తారు. ఆ తర్వాత క్రూ-10 వ్యోమనౌకలో సునీతా, విల్‌మోర్ భూమికి తిరిగి రానున్నారు. వారిద్దరినీ వీలైనంత త్వరగా భూమి పైకి తీసుకు రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించిన నేపథ్యంలో ప్రాక్టికల్‌గా వీలైనంత త్వరగా వారిని భూమి మీదకు తీసుకొస్తామని నాసా మంగళవారం ప్రకటించింది.

చెర్నోబిల్ అణుప్లాంట్‌పై రష్యా డ్రోన్ దాడి

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటన

కీవ్, ఫిబ్రవరి 14: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని చెర్నోబిల్ అణు విద్యుత్తు కర్మాగారానికి చెందిన రియాక్టర్ రక్షణ కవచంపై రష్యా డ్రోన్ దాడి జరిపినట్టు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శుక్రవారం ప్రకటించారు. దీని వల్ల మంటలు చెలరేగగా అక్కడి సిబ్బంది వెంటనే అర్పివేశారని ఆయన చెప్పారు. ఈ దాడి కారణంగా రేడియేషన్ స్థాయి పెరగలేదని జెలెన్‌స్కీ తెలిపారు. ఐక్య రాజ్య సమితి(యూఎన్)కి చెందిన అణు సంస్థ స్పందిస్తూ చెర్నోబిల్ అణు విద్యుత్తు కర్మాగారం వద్ద ఉన్న తమ సిబ్బంది పేలుడు శబ్దం విన్నారని, రక్షణ కవచంపై డ్రోన్ దాడి జరిగిందన్న సమాచారం వారికి అందిందని తెలిపింది. అయితే ఈ దాడికి రష్యా పాల్పడినట్టు సంస్థ వెల్లడించలేదు. కాగా, జెలెన్‌స్కీ ఆరోపణలను రష్యా ఖండించింది.

రైతు నేతలతో కేంద్రం చర్చలు

చండీగఢ్: పంటలకు ఇస్తున్న కనీస మద్దతు ధరకు(ఎంఎస్‌పీ) చట్టబద్ధత కల్పించడంతోసహా వివిధ డిమాండ్లపై రైతుల ప్రతినిధులు, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నేతృత్వంలోని కేంద్ర బృందం మధ్య శుక్రవారం చర్చలు జరిగాయి. తదుపరి విడత చర్చలు ఫిబ్రవరి 22న జరుగుతాయి. రైతులతో చర్చలు సుహృద్భావ వాతావరణంలో జరిగాయని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. రైతుల సంక్షేమం కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను సమావేశంలో రైతు నాయకులకు వివరించామని ఆయన తెలిపారు.

రైతులను బిచ్చగాళ్లతో పోల్చిన

మహారాష్ట్ర మంత్రి

ముంబై: మహారాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మాణిక్ రావ్ కోకటే రైతులను బిచ్చగాళ్లతో పోల్చారు. అమరావతిలో శుక్రవారం జరిగిన వ్యవసాయ ప్రదర్శన సందర్భంగా రూ.1కే పంటల బీమా గురించి ఓ విలేకరి ప్రశ్నించినపుడు ఆయన స్పందిస్తూ, 'బిచ్చగాడు సైతం రూ.1ని భిక్షంగా తీసుకోడు, కానీ మేము రూ.1కే పంటల బీమా ఇస్తున్నాం. అయినప్పటికీ దీనిని దుర్వినియోగం చేసేవారు ఉన్నారు. ఇతర రాష్ట్రాలవారు దరఖాస్తు చేస్తుండటం వంటి అక్రమాలు జరుగుతున్నాయి. వాటిని ఆపవలసి ఉంది 'అని అన్నారు. రైతులను మంత్రి అవమానించారని కిసాన్ సభఆగ్రహం వ్యక్తం చేసింది. మంత్రిని క్యాబినెట్ నుంచి తొలగించాలని కాంగ్రెస్ డిమాండ్‌చేసింది.

భారత్‌నూ వదిలిపెట్టం

- మాపై వాళ్లు ఎంత పన్ను వేస్తే.. మేమూ అంతే విధిస్తాం
- ప్రధాని మోదీ సమక్షంలోనే తేల్చిచెప్పిన డొనాల్డ్ ట్రంప్
- వైట్‌హౌజ్‌లో ఇరువురు దేశాధినేతల కీలక సమావేశం
- భారత్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలు విక్రయిస్తాం
- తహవ్వుర్ రాణానూ అప్పగిస్తామని ట్రంప్ ప్రకటన
- అక్రమ వలసదారులను వెనక్కు రప్పిస్తాం: మోదీ

వాషింగ్టన్: తమ ఉత్పత్తులపై భారత్ ఎలా సుంకాలను విధిస్తే.. తామూ అలానే ప్రతీకార సుంకాలు వేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ముందే ఆయన ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టారు. అమెరికా పర్యటనలో భాగంగా శుక్రవారం వైట్‌హౌజ్‌లో ట్రంప్‌తో మోదీ సమావేశమయ్యారు. పలు ద్వైపాక్షిక, వాణిజ్య అంశాలపై చర్చించిన తర్వాత ఇరువురూ ఉమ్మడిగా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. 'ఇండియా మా ఉత్పత్తులపై ఎలా సుంకాలు విధిస్తే.. మేమూ అలానే విధిస్తాం. భారత్‌తో పరస్పర సుంకాలు ఉంటాయి' అని పేర్కొన్నారు. కొన్ని అమెరికా ఉత్పత్తులపై భారత్ విధిస్తున్న దిగుమతి సుంకాలు చాలా అన్యాయం, ఎక్కువగా ఉన్నాయని అన్నారు. భారత్‌కు అతిపెద్ద చమురు, గ్యాస్ సరఫరాదారుగా అమెరికా మారగలిగే ఒక ఒప్పందాన్ని చేసుకుంటున్నట్టు ప్రకటించారు. భారత్‌తో వాణిజ్య లోటును తగ్గించడంలో ఇది భాగమని చెప్పారు. ఈ ఏడాది నుంచి భారత్‌కు ఆయుధ విక్రయాలు కొన్ని బిలియన్ డాలర్లు పెరిగుతాయని, ఎఫ్-35 ఫైటర్ జెట్లను సైతం భారత్‌కు సరఫరా చేస్తామని ప్రకటించారు.

తహవ్వుర్ రాణాను అప్పగిస్తాం

ఇస్లామిక్ ఉగ్రవాద ముప్పును ఎదుర్కొనేందుకు భారత్, అమెరికా కలిసి పని చేయనున్నట్టు ట్రంప్ చెప్పారు. 26/11 ముంబై పేలుళ్ల నిందితుడు తహవ్వుర్ రాణాను వెంటనే భారత్‌కు అప్పగించేందుకు ఆమోదం తెలిపినట్టు ప్రకటించారు.

వైట్‌హౌజ్‌లో జరిగిన సమావేశంలో కరచాలనం చేస్తున్న నరేంద్ర మోదీ, డొనాల్డ్ ట్రంప్

డాలర్‌తో ఆటలాడితే వాణిజ్య యుద్ధమే

డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీ తీసుకురావాలని బ్రిక్స్ దేశాలు ఆలోచిస్తున్నాయనే వార్తలపై ట్రంప్ ఘాటుగా స్పందించారు. మోదీతో భేటీకి ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బ్రిక్స్ ఒక చెడ్డ ప్రతిపాదనను తెచ్చింది. దీనిని ఎవరూ అంగీకరించరు. డాలర్‌తో ఆటలాడితే 100 శాతం సుంకాలు విధిస్తానని నేను చేసిన హెచ్చరికతో ఇప్పుడు ఆ ప్రతిపాదన గురించి మాట్లాడేందుకు వారు(బ్రిక్స్ దేశాలు) భయపడుతున్నారు. ఒకవేళ ఈ ప్రతిపాదనను అమలు చేయాలని వారు అనుకుంటే మళ్లీ నా దగ్గరకు వచ్చి సుంకాలు వద్దని అడుక్కోవాల్సి వస్తుంది. ఈ మాట నేను చెప్పిన మరుక్షణమే బ్రిక్స్ అంతమైంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

అక్రమ వలసదారులను రప్పించేందుకు సిద్ధం: మోదీ

అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులను వెనక్కు రప్పించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని మోదీ ప్రకటించారు. ఎవరైనా అక్రమంగా వేరే దేశంలోకి ప్రవేశించి, నివసించే హక్కు లేదని ఆయన స్పష్టం చేశారు. మొత్తం మానవ అక్రమ రవాణా వ్యవస్థపైనే పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, ట్రంప్‌తో భేటీలో అదానీ అంశం చర్చకు వచ్చిందా? అని మోదీని మీడియా ప్రతినిధి ఒకరు ప్రశ్నించారు. రెండు దేశాలకు చెందిన ఇద్దరు ప్రముఖ నేతలు ఎప్పుడూ అలాంటి వ్యక్తిగత అంశాలపై చర్చించరని మోదీ బదులిచ్చారు. ట్రంప్ అమెరికా ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చినట్టుగా, తనకు భారతదేశ ప్రయోజనాలే ముఖ్యమని అన్నారు. భారత్‌లో క్యాంపస్‌లు ప్రారంభించాల్సిందిగా అమెరికా విద్యాసంస్థలను ఆహ్వానించారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్ట్జ్, నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్, బిలియనీర్ ఎలాన్ మస్క్‌తో మోదీ సమావేశమయ్యారు.

భార్య వేరొకరిని ప్రేమించడం నేరం కాదు

- శారీరక సంబంధం లేనపుడు వివాహేతర సంబంధం కాదు
- భార్య కోసం భర్త సంపాదించాల్సిందే
- మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు

భోపాల్: భార్య వేరొక వ్యక్తి పట్ల ప్రేమ, ఆప్యాయతలను ప్రదర్శించినపుడు, ఆ ఇద్దరి మధ్య శారీరక సంబంధాలు లేనంత వరకు, ఆమె వివాహేతర సంబంధానికి పాల్పడినట్టు కాదని మధ్యప్రదేశ్ హైకోర్టు చెప్పింది. భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్టు రుజువైతేనే ఆమెకు మనోవర్తి, పోషణ భత్యాలను నిరాకరించవచ్చునని వివరించింది. వేరుగా ఉంటున్న భార్యకు పోషణ భత్యం చెల్లించాలని ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై భర్త చేసిన అప్పీలును హైకోర్టు తోసిపుచ్చింది. భర్తకు అత్యల్ప ఆదాయం వస్తుండటం భార్యకు పోషణ భత్యాన్ని తిరస్కరించడానికి తగిన కారణం కాదని చెప్పింది. తన రోజువారీ అవసరాలను తీర్చుకోవడానికి తగిన సామర్థ్యం తనకు లేదని సంపూర్ణంగా తెలిసి కూడా ఓ పురుషుడు ఓ యువతిని వివాహం చేసుకుంటే, అందుకు బాధ్యత వహించవలసినది అతడేనంది.

50 కోట్ల మంది పుణ్య స్నానాలు

మహా కుంభ మేళాలో రికార్డ్.. ఎనిమిది పెద్ద దేశాల జనాభా సంఖ్య కన్నా అధికం

మహాకుంభ్ నగర్, ఫిబ్రవరి 14: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు నిత్యం యాత్రికులు వరదలా పోటెత్తుతున్నారు. ఈ మేళా జరుగుతున్న త్రివేణి సంగమంలో శుక్రవారం సాయంత్రం వరకు 50 కోట్ల మందికిపైగా యాత్రికులు పుణ్య స్నానాలు చేశారని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఏ మతానికి సంబంధించి అయినా ఈ సంఖ్య మానవ చరిత్రలో అతిపెద్ద సామూహిక సమాజ భాగస్వామ్యంగా నిలుస్తుందని తెలిపింది. భారత్, చైనా మినహాయించి ఎక్కువ జనాభా గల 8 దేశాల జనాభా సంఖ్యను కుంభమేళాను దర్శించిన హిందూ యాత్రికుల సంఖ్య దాటేసిందని వెల్లడించింది. యూఎస్ జనాభా బ్యూరో ప్రకారం చైనా, భారత్ తర్వాత అత్యధిక జనాభా(34.20 కోట్లు) గల మూడో దేశం అమెరికా. యూపీ సర్కార్ లెక్కల ప్రకారం శుక్రవారం ఒక్కరోజే సాయంత్రం 6 గంటల సమయానికి 92 లక్షల మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌లో స్నానమాచరించారు. 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ కుంభ మేళా గత నెల 13న ప్రారంభమైంది. ఈ నెల 26 వరకు ఇది కొనసాగనుంది. జనవరి 29న మౌని అమావాస్య సందర్భంగా ఇప్పటి వరకు అత్యధికంగా త్రివేణి సంగమంలో 8 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు చేశారని యూపీ ప్రభుత్వం అంచనా వేసింది. ఆ రోజు జరిగిన తొక్కిసలాటలో 30 మంది చనిపోయారు. అయినప్పటికీ ఆ తర్వాత కూడా ప్రతి రోజూ లక్షలాది మంది భక్తులు మహా కుంభ మేళాకు తరలి వస్తూనే ఉన్నారు.

మమతా కులకర్ణి రాజీనామా తిరస్కరణ

మహాకుంభ్ నగర్: మమతా కులకర్ణి రాజీనామా తిరస్కరణకు గురి కావడంతో ఆమె కిన్నర్ అఖాడా 'మహా మండలేశ్వర్'గా కొనసాగనున్నారు. గత నెల 24న ఆమెను ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మహా మండలేశ్వర్‌గా ప్రకటించారు. దీంతో అఖాడాలో సభ్యుల మధ్య వివాదాలు చెలరేగాయి. చేరిన కొత్తలోనే ఆమెకు 'మహా మండలేశ్వర్' లాంటి అత్యున్నత హోదాను కట్టబెట్టడాన్ని కొందరు వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 10న తాను అఖాడాకు రాజీనామా చేస్తున్నానని కులకర్ణి ప్రకటించారు. అయితే తన రాజీనామాను తిరస్కరించారని గురువారం ఆమె ఓ వీడియో విడుదల చేశారు. 'మహా మండలేశ్వర్‌గా నా రాజీనామా ఆమోదం పొందలేదు. ఆచార్య లక్ష్మీనారాయణ త్రిపాఠి నన్ను అదే హోదాలో కొనసాగమన్నందుకు నేను కృతజ్ఞురాలిని' అని మమత పేర్కొన్నారు.

కర్ణాటక కాంగ్రెస్‌లో 'చదరంగం'

- ఐదేండ్లూ ముఖ్యమంత్రిగా ఉండేందుకు సిద్ధూ ఎత్తులు
- సన్నిహిత మంత్రులతో అనుకూలంగా ప్రకటనలు
- డీకే శివకుమార్ 'పవర్'ను తగ్గించే ముమ్మర ప్రయత్నాలు
- సిద్ధూ వర్గం మంత్రులకు చెక్ పెడుతున్న శివకుమార్
- కర్ణాటక కాంగ్రెస్ సర్కారులో ముదిరిన కుమ్ములాటలు

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. సీఎం పదవిని డీకే శివకుమార్‌కు అందకుండా చేయడానికి సీఎం సిద్ధరామయ్య వర్గం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. డీకే శివకుమార్ పవర్ తగ్గించేందుకు వ్యూహాలు అమలు చేస్తున్నది. మరోవైపు సిద్ధరామయ్య సన్నిహితుల మంత్రి పదవులను ఊడగొట్టేందుకు డీకే శివకుమార్ ప్రయత్నిస్తున్నారు. ఇరు వర్గాల ఎత్తుగడలో కర్ణాటక కాంగ్రెస్ రాజకీయ పోరు ఢిల్లీ చేరింది. కాంగ్రెస్ అధిష్ఠాన పెద్దలను కలుస్తూ ఇరు వర్గాల నేతలు ఒకరికి ఒకరు చెక్ పెట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

రికార్డుపై కన్నేసిన సిద్ధరామయ్య

కర్ణాటకలో అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పని చేసే రికార్డును సొంతం చేసుకోవాలని సిద్ధరామయ్య ఆశ పడుతున్నారు. బుధవారం ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని బయటపెట్టారు. ఇప్పుడు ఈ రికార్డు మాజీ సీఎం దేవరాజ్ అర్స్ పేరిట ఉంది. ఆయన 2,792 రోజులు సీఎంగా పని చేశారు. సిద్ధరామయ్య ఇప్పటికి 2,467 రోజులు ముఖ్యమంత్రిగా ఉన్నారు. వచ్చే ఏడాది జనవరి 6 వరకు సీఎం పదవిలో కొనసాగితే ఈ రికార్డును సిద్ధరామయ్య అధిగమిస్తారు. అయితే, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ సీఎం పదవీకాలాన్ని రెండున్నరేండ్ల చొప్పున పంచుకోవాలనే ఒప్పందం ఉందనే ప్రచారం ఉంది. ఈ ఒప్పందం అమలైతే ఈ ఏడాదే సీఎం పదవిని డీకే శివకుమార్‌కు అప్పగించాల్సి ఉంటుంది. డీకేకు సీఎం పదవి ఇచ్చేందుకు సిద్ధూ వర్గం సిద్ధంగా లేదు. జీ పరమేశ్వర, ఎంబీ పాటిల్, హెచ్‌సీ మహదేవప్ప లాంటి సిద్ధరామయ్య సన్నిహిత మంత్రులు తెరపైకి వచ్చి.. ఐదేండ్లూ సీఎంగా సిద్ధరామయ్య కొనసాగుతారని, దేవరాజ్ అర్స్ రికార్డును అధిగమిస్తారని ప్రకటిస్తున్నారు.

డీకే శివకుమార్ ప్రతివ్యూహాలు

సీఎం వర్గానికి చెక్ పెట్టేందుకు డీకే శివకుమార్ ప్రతివ్యూహాలు అమలు చేస్తున్నారు. మంత్రుల పనితీరును సమీక్షించి, పనితీరు సరిగ్గా లేని మంత్రులను తప్పించాలని ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అధిష్ఠానాన్ని డీకే శివకుమార్ కోరినట్టు తెలుస్తున్నది. సిద్ధరామయ్యకు సన్నిహితులైన ఏడుగురు మంత్రులను తప్పించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. దీంతో హుటాహుటిన ఢిల్లీ వెళ్లిన సిద్ధరామయ్య వర్గీయులు.. డీకే శివకుమార్‌ను పీసీసీ పదవి నుంచి తొలగించాలని, ఆయన నిర్వహిస్తున్న ఇరిగేషన్, బెంగళూరు నగరాభివృద్ధి శాఖలను ఇతర మంత్రులకు కేటాయించాలని పట్టుబడుతున్నట్టు సమాచారం. డీకే సన్నిహితులైన ఇద్దరు మంత్రులను మంత్రివర్గం నుంచి తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల్లో వరుస ఎదురుదెబ్బలతో సతమతమవుతున్న కాంగ్రెస్ అధిష్ఠానం.. కర్ణాటకలో వర్గపోరుతో తలపట్టుకున్నది.

ఒకేరోజు ఆరు గిన్నిస్ రికార్డులు

మహారాష్ట్ర బాలుడి ఘనత

ముంబై : మహారాష్ట్రకు చెందిన ఆర్యన్ శుక్లా (14) ఒక రోజులో ఆరు గిన్నిస్ రికార్డులను సృష్టించాడు. ఐదు అంకెలు గల 50 సంఖ్యలను 25.19 సెకండ్లలో కూడిక చేసి రికార్డు సృష్టించాడు. నాలుగు అంకెలు గల 100 సంఖ్యలను అత్యంత వేగంగా 30.9 సెకండ్లలో కూడిక చేయడం, నాలుగు అంకెలు గల 200 సంఖ్యలను 1 నిమిషం 9.68 సెకండ్లలో కూడిక చేయడం, 20 అంకెలు గల సంఖ్యను 10 అంకెలు గల సంఖ్య చేత అత్యంత వేగంగా, అంటే, 5 నిమిషాల 42 సెకండ్లలో భాగించడం, 2 ఐదు అంకెలు గల సంఖ్యల 10 సెట్స్‌ను అత్యంత వేగంగా, 51.69 సెకండ్లలో, గుణించడం, 2 ఎనిమిది అంకెల సంఖ్యల 10 సెట్స్‌ను అత్యంత వేగంగా 2 నిమిషాల 35.41 సెకండ్లలో గుణించడం, నాలుగు అంకెల 100 సంఖ్యలను 30.9 సెకండ్లలో కూడిక చేశాడు.

బీర్ క్యాన్లపై గాంధీజీ బొమ్మ

న్యూఢిల్లీ: మహాత్మా గాంధీ చిత్రాలు ముద్రించిన క్యాన్లలో 'మహాత్మా జీ' బ్రాండ్‌తో బీర్ అమ్ముతున్న రష్యన్ కంపెనీ రివోల్ట్‌పై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఒడిశా సామాజిక-రాజకీయ నాయకుడు సుపర్ణో సత్పతి ఈ బీర్ క్యాన్ల చిత్రాలను తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఈ విషయంలో ప్రధాని మోదీ జోక్యం చేసుకొని రష్యా అధికారులతో మాట్లాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గాంధీజీ చిత్రాలున్న రివోల్ట్ బీర్ క్యాన్లను ఇద్దరు భారతీయులు పట్టుకొని ఉన్న వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో చాలా మంది షేర్ చేశారు. రివోల్ట్ కంపెనీ చర్యపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అగౌరవనీయమని, దిగ్భ్రాంతి కలిగించేదని కొందరు అన్నారు. ఇది ఆమోద యోగ్యం కాదని మరొకరు వ్యాఖ్యానించారు.

ఆవుల అపాన వాయువు నివారణకు టీకా!

- వ్యాక్సిన్ అభివృద్ధికి 81 కోట్లు ఖర్చు చేస్తున్న బెజోస్
- గోవుల నుంచి వెలువడుతున్న మీథేన్‌తో పర్యావరణానికి హాని

న్యూయార్క్, ఫిబ్రవరి 14: లాభాల పంట పండే ప్రాజెక్టులపై పెట్టుబడులు పెట్టడం వ్యాపారవేత్తల మొదటి లక్షణం. ప్రపంచ కుబేరులంతా కృత్రిమ మేధ, అంతరిక్ష పరిశోధనల్లో పెట్టుబడులపై దృష్టి పెట్టగా అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్